# ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

- మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు
- పాల్గొన్న బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ వసంత

మల్లాపూర్, మార్చి 20: కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు స్వగ్రామమైన రాఘవపేటలో బుధవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పురోహితుడు మాధవాచార్యుల ఆధ్వర్యంలో నిత్యహోమం, బలిహరణ, ఎదుర్కోలు, పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించడంతో పాటు, వేద మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా కల్యాణం జరిపించారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నత్తి లావణ్య, కమిటీ అధ్యక్షుడు నారాయణ, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాఘవపేటలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు

మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## నేడు బీఆర్ఎస్ సమావేశాలు

మెట్‌పల్లి/కోరుట్ల, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం తెలిపారు. కోరుట్ల పట్టణంలోని కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి కోరుట్ల పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, అదే విధంగా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని విదిత్‌రెడ్డి గార్డెన్స్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సమావేశానికి మెట్‌పల్లి పట్టణ, మండలానికి చెందిన ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని వారు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయా సమావేశాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలి

కోరుట్ల, మార్చి 20: బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీ ప్రభాకర్ భననంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బీడీ పరిశ్రమల్లో పని చేస్తున్న ఏడు లక్షల మంది కార్మికులు, బీడీ టేకాదారుల వేతన ఒప్పంద కాల పరిమితి మార్చి నెల 31తో ముగుస్తుందన్నారు. పరిశ్రమల యాజమన్యాలు కార్మికుల వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిజామాబాద్‌లోని బీడీ మ్యాన్‌ఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

# జీవన్‌రెడ్డి.. మీ హామీలేమైనయ్?

- పంటలకు మద్దతు ధరేది
- వరికి రూ.500 బోనసేది
- మహిళలకు రూ.2500 భృతి ఏది?
- నెలకు రూ.4వేల పింఛన్ ఏమైంది?
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ధ్వజం

జగిత్యాల టౌన్, మార్చి 20: 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలిచ్చింది. రైతులకు ఎన్నో ఆశలు కల్పించింది. అన్నీ అసత్యాలు చెప్పి గద్దెనెక్కింది. ఆ హామీలన్నీ ఏమయ్యాయో..? ఎప్పుడు అమలు చేస్తారో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పాలి' అని ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. జీవన్‌రెడ్డి ఈ ఎంపీ ఎన్నికల్లో గెలవాలంటే రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చచేశారు. ధవారం మోతె రోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తయిందని చెప్పారు. అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేశారని, వాటిని లెక్కపెట్టి '420' అని బీఆర్ఎస్ వ్యాఖ్యానిస్తే, మొన్న జరిగిన బీజేపీ మీటింగ్‌లో వారు '421' అని అన్నారని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనా పెద్ద సంఖ్యలో వాగ్దానాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. వ్యవసాయ ఉత్పత్తులన్నింటికీ మద్దతు ధర మీద రూ.500 బోనస్ ఇస్తామని జగిత్యాల నడిబొడ్డున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సైతం చెప్పారని గుర్తుచేశారు. అయితే ఈ యాసంగికి సంబంధించి ఏప్రిల్ మొదటి వారంలో కోతలు ప్రారంభమవుతాయని, ఈ క్రమంలో జగిత్యాలలో 4 లక్షల క్వింటాళ్లు, రాష్ట్ర వ్యాప్తంగా 60 నుంచి 70 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి కేంద్రం మద్దతు ధర రూ.2203 ప్రకటించగా, దానిపై కాంగ్రెస్ ఇస్తామన్న బోనస్ రూ.500 కలిపి రూ.2703 ప్రతి రైతుకు అందించాలని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించారని, కానీ మూడెకరాల భూమి ఉన్న రైతుల వరకు మాత్రమే ఇచ్చి మిగతావారిని గాలికివదిలేశారని మండిపడ్డారు. తానొక్కటే విజ్ఞప్తి చేస్తున్నానని మీరు హామీ ఇచ్చినట్లుగా ప్రతి పంట మద్దతు ధర మీద రూ.500ను ప్రతి రైతుకు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇక జగిత్యాల జిల్లాలో 35 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయని, మామిడి రైతులెవరికీ రైతు బంధు సాయం రాలేదన్నారు. కనీసం 5 నుంచి 10 ఎకరాల వరకు తోటలు ఉన్న వారికైనా ఇవ్వాలని కోరారు. అయితే ఈ సారి 35 వేల ఎకరాల్లో దాదాపు 32 వేల ఎకరాల్లో మామిడి తోటలకు తేనెమంచు పురుగు ఆశించి తీరని నష్టం జరిగిందని, వారందరికీ ఎకరాకు రూ.25వేల సాయం చేసి ఆదుకోవాలని కోరారు. నష్టం ఎంత జరిగిందో తెలుసుకోవాలన్న ఆలోచన కూడా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులకు లేదని, కనీసం ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడి నష్టం రిపోర్టులైనా తీసుకున్నారా..? చెప్పాలని ప్రశ్నించారు. గతంలో రైతుల పక్షాన ప్రెస్‌మీట్లు పెట్టి గంటల తరబడి మాట్లాడిన జీవన్‌రెడ్డి, ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సాగునీరందక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ధర్మపురి, గొల్లపల్లి, చొప్పదండితో పాటు జగిత్యాల నియోజకవర్గంలోని చింతలూరు, బట్టపెల్లి, పోతారం ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఎస్సారెస్పీలో మిగిలి ఉన్న 19 టీఎంసీల నీటిని సక్రమంగా వినియోగించి ఆయకట్టు స్టేట్-1లో ఉన్న మన జిల్లాలో ఒక్క ఎకరం పంట ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో మక్కకు మద్దతు ధర మీద రూ.330 ఇస్తామని చెప్పిందని, ప్రస్తుతం రూ.2090 ఉందని దానికి అదనంగా రూ.330 కలిపి రూ.2420 రైతులకు ఇచ్చి మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా మహిళలకు రూ.2500, వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణ మాఫీ చేసిందన్నారు. మీరు రూ.2 లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పారని, కాంగ్రెస్ మొత్తం ఉద్దెర పథకాలను ప్రారంభించి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. మీ పార్టీ, మీరు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన తర్వాతనే ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ మహేశ్, వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, దావ సురేష్, జంబర్తి శంకర్, రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, గంగారెడ్డి, హరీష్, బాలముకుందం, ఆరీఫ్, భిక్షపతి, లక్ష్మణ్, సత్తిరెడ్డి, వంశి, బాబు, ఏనుగుల రాజు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

# వైభవంగా ఆరంభం

- ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాలు మొదలు
- తరలివచ్చిన భక్తజనం.. ప్రత్యేక పూజలు
- నేడు స్వామివారి కల్యాణోత్సవం

ధర్మపురి, మార్చి20: ధర్మపురి క్షేత్రం పులకించింది. లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవ వేడుక వైభవంగా మొదలైంది. వేడుకల్లో భాగంగా తొలిరోజు బుధవారం ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్ కలిసి మేళతాళాలతో యజ్ఞాచార్యులు, పండితులు, అర్చకుల వద్దకు వెళ్లి దీక్షావస్త్రాలు సమర్పించి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో యజ్ఞాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి ఘట్టమైన పుట్ట బంగారం పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చింతామణి చెరువు సమీపంలోని పుట్టబంగారం మండపానికి తీసుకువచ్చారు. ఉత్సవ మూర్తులను మండపంలో ఉంచి యాజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచార్యుల మంత్రోచ్చరణల మధ్య ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పుట్టబంగారాన్ని తవ్వగా భక్తులు భక్తిశ్రద్ధలతో సేకరించారు. పుట్టబంగారాన్ని పంట పొలాల్లో చల్లుకుంటే పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తగా, వేసవి దృష్ట్యా ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికారులు చలువపందిళ్లు వేశారు. గురువారం సాయంత్రం 6గంటలకు గోధూళి సుముహూర్తాన స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనుండగా, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉత్సవ కమిటి సభ్యులు ముత్తినేని మల్లేశం, బాధినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఎదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంబంకాడి గణేశ్, పసుపునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేశ్, లసెట్టి సుజాత, కొంరెల్లి పవన్‌కుమార్, నేదునూరి శ్రీధర్ ఉన్నారు. కాగా, గురువారం స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున కలెక్టర్ యాస్మిన్ భాషా పట్టువస్త్రాలు, కల్యాణ తలంబ్రాలను సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుట్టబంగారాన్ని తవ్వుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

# ఎనిమిదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

- తలలో రక్తం గడ్డ కట్టి అస్వస్థతకు గురైన విద్యార్థి
- ఆలస్యంగా వెలుగులోకి.. తల్లిదండ్రుల ఆందోళన

వెల్గటూర్, మార్చి 20: గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేశారు. ఆ బాలుడి తలకు తీవ్రగాయమై అస్వస్థత చెందగా, తల్లిదండ్రులు ఆగ్రహించారు. బుధవారం ఆ పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. బాధిత విద్యార్థి, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. గొల్లపెల్లి మండలం గుంజపడుగుకు చెందిన పస్తం లత-కనకయ్య కొడుకు రిషి (13) వెల్గటూర్ మండలం స్తంభంపల్లి బీసీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. రిషి తన పుట్టినరోజు డ్రెస్ దొంగిలించాడని తోటి విద్యార్థి రాము జనవరి 9వ తేదీన 9, 10వ తరగతి చదువుతున్న అభినయ్, శ్రీహర్ష, శ్రీకాంత్‌కు చెప్పుకున్నాడు. అదే రోజు రాత్రి సమయంలో రిషిని ఆ ముగ్గురు విద్యార్థులు డ్రెస్ గురించి అడిగారు. తనకేం తెలియదని చెప్పినా వినకుండా పరీక్ష ప్యాడ్‌లతో తలపై కొట్టారు. అప్పుడే తలకు తీవ్రగాయమైంది. అయితే ఈ విషయాన్ని ఎవరికి చెప్పొద్దని వారు బెదిరించడంతో రిషి ఉపాధ్యాయులకు గానీ, తల్లిదండ్రులకు గానీ చెప్పుకోలేదు. అయితే కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురవుతుండడంతో తల్లిదండ్రులు హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లి దవాఖానల్లో చూపించారు. అయినా తగ్గక పోవడంతో మూడు రోజుల క్రితం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ వైద్యుడికి చూపించారు. ఎంఆర్ఐ తీయించగా.. తలకు బలమైన గాయం కావడంతో మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో తల్లిదండ్రులు రిషిని ఏమైందని గట్టిగా అడుగడంతో అసలు విషయం చెప్పాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు బుధవారం స్తంభంపల్లి గురుకులానికి చేరుకోని ఆందోళన చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని తల్లిదండ్రులను సముదాయించారు. ఈ విషయమై మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీవో) గౌతమ్‌కుమార్‌ను సంప్రదించగా.. గొడవలు జరగకుండా క్రమశిక్షణ కమిటీ వేశామని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, గత నెలలో సీనియర్ సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ కూడా ఇప్పించామని తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు, పోలీసులు

## 'భారత్ రైస్'ను వినియోగించుకోవాలి

కోరుట్ల, మార్చి 20: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ రైస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ పెండెం గణేశ్ సూచించారు. బుధవారం పట్టణంలోని బీమునిదుబ్బ అటుకుల గిర్నీ సమీపంలో ఏర్పాటు చేసిన భారత్ రైస్ కొనుగోలు కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఈ పథకం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యం అతి తక్కువ ధరకు లభిస్తుందన్నారు. ఇక్కడ నాయకులు బెజ్జారపు చందు, జక్కుల ప్రవీణ్, గందె నవీన్, బీజేవైఎం పట్టణాధ్యక్షుడు కలాల సాయిచందు, రంజిత్ రావు, గుండేటి సంజీవ్, తదితరులున్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు

సారంగాపూర్, మార్చి 20: రంగపేటలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి, సిబ్బంది పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వేణుగోపాలరావు, సహాయ సంచాలకుడు డాక్టర్ నరేశ్ శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి బద్దం రాజేందర్‌రెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

పెగడపల్లి/జగిత్యాల/జగిత్యాల టౌన్, మార్చి 20: పెగడపల్లిలోని మోడల్ స్కూల్, జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో స్వీప్ ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో బుధవారం ఓటు హక్కుపై విద్యార్థులు, ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు విలువ, ప్రాధాన్యం, నమూనా బ్యాలెట్ వంటి వాటిపై ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులు స్వీప్ ఆకారంలో కూర్చున్నారు. ఓల్డ్ హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి, ఉపాధ్యాయుడు మనోజ్‌కుమార్, ఓల్డ్ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశీ యాత్రకు వెళ్లొచ్చి..

## శునకం కాళ్లు మొక్కి

జగిత్యాల, మార్చి 20 : జిల్లా కేంద్రంలోని వాణినగర్‌కు చెందిన నాగమల్ల రాజేశం-అనంతలక్ష్మి దంపతులు కాశీ పర్యటనకు వెళ్లొచ్చారు. ఆనవాయితీ ప్రకారం బుధవారం తులసీనగర్‌లో ఆకుల నాగరాజు ఇంట్లోని శునకానికి స్నానం చేపించి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి శునకం మెడలో పూలమాల వేశారు. కాళ్లు మొక్కి పూజలు చేశారు. అనంతరం స్వీట్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు.

## తనిఖీల్లో నగదు పట్టివేత

- రూ. లక్షా 20 వేలు సీజ్

మేడిపల్లి, మార్చి 20: మేడిపల్లి మండల కేంద్రం శివారులో రూ. లక్షా 20 వేలను వాహన తనిఖీల్లో పట్టుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. బుధవారం ఎస్ఐ శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ. లక్షా 20 వేలు తీసుకెళ్తున్నాడు. ఈ మేరకు పోలీసులు నగదు సీజ్ చేశారు. పై అధికారుల సూచన మేరకు సీజ్ చేసిన నగదును వేములవాడ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి పంపినట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

## పసుపు @ 15,121

మెట్‌పల్లి, మార్చి 20: పసుపు ధరలు మళ్లీ నిరాశ పరుస్తున్నాయి. నాలుగు రోజులుగా దిగువకు పడిపోతున్నాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15,121, కనిష్ఠంగా రూ.4వేలు, పసుపు గోళకు గరిష్ఠంగా రూ.14, 521, కనిష్ఠంగా రూ.3,001, పసుపు చూరకు గరిష్ఠంగా రూ.13,221, కనిష్ఠంగా రూ.9,266 ధర పలికింది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సారంగాపూర్, మార్చి 20: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు సారంగాపూర్ ఉమ్మడి మండల కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు గుడిసె జితేందర్‌యాదవ్, ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జితేందర్ యాదవ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థికసాయం

కథలాపూర్, మార్చి 20: అంబారిపేట గ్రామానికి చెందిన మార్క చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందించారు. అంబారిపేట సొదీ అసోసియేషన్ తరపున రూ. 10 వేలు, స్థానికుడైన వల్లకొండ మనోజ్ రూ. 5 వేలు, మహేంద్ర యూత్ సభ్యులు రూ.3 వేలు, విజేత యూత్ సభ్యులు రూ. 2 వేలు ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గోడలపై పోస్టర్ల తొలగింపు

మేడిపల్లి, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో రాజకీయ పోస్టర్లు, గోడలపై రాతలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు.


ఎండపెల్లిలో కొప్పుల ఈశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

## రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న కొప్పుల

వెల్గటూర్, మార్చి 20: ఎండపెల్లి మండల కేంద్రంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ పట్నాలు వేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పెద్దపెల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, మార్చి 20: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని అయ్యప్ప గుట్ట, బీసీ కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా తాళ్ల చెరువుకు పడిన గండిని రైతులతో కలిసి పరిశీలించారు. గండిని పూడ్చాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం పలు కాలనీల్లో పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్నింగ్ వాకర్స్‌తో కలిసి తేనీటి విందు సేవించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలుంటే సంప్రదించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని సంజయ్ పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్ గంధం గంగాధర్, నాయకులు బట్టు సునీల్, భూమేశ్వర్, గుణాకర్‌రెడ్డి, వెంకటేశం, రహీం, తదితరులున్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో నాగెల్లి

నాగెల్లి వేడుకల్లో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 20: అర్పల్లి గ్రామ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాగెల్లి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల నృత్యాలు అలరించాయి. అటవీ ప్రాంతంలోని రాజరాజేశ్వర స్వామి, మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ తల్లి, ఆంజనేయ స్వామిని ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించారు.

## మోదీ పాలనలో రైతులకు అన్యాయం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

రాయికల్, మార్చి 20: మోదీ ప్రభుత్వం రైతులు, యువతకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. రాయికల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. ముఖ్యంగా సాగు రంగం అభివృద్ధికి అనేక రూపకల్పనలు చేసి రైతులు, వ్యవసాయ కూలీలకు అండగా నిలిచిందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే సోమరి పోతులు అవుతారు అని బీజేపీ అనడం సరికాదన్నారు. బడా వ్యాపారులకు మోదీ సర్కార్ లక్షల కోట్లరూపాయలు ఎలా మాఫీ చేస్తారని ప్రశ్నించారు.

## ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 20: లక్ష్మీపూర్‌కు చెందిన నక్క శ్రీనివాస్‌కు తుంటి శస్త్ర చికిత్స కాగా బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆయనను పరామర్శించారు. ఆర్యోగ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన గర్వందుల గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మణ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత క్రీడలతో పాటు సేవ చేయాలి

కథలాపూర్, మార్చి 20: యువత క్రీడలతో పాటు సామాజిక సేవ చేస్తూ ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం భూషణరావుపేటలో కేఎంపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నీని 